
# పార్టీలు మార్చే ఊసరవెల్లి 'కొమ్మూరి'



జనగామ పట్టణంలోని 6వ వార్డులో ప్రచారం చేస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- స్వార్థం కోసం నాలుగు పార్టీలు మారిండు
- దమ్ముంటే అభివృద్ధి పనుల్లో పోటీపడాలే
- జనగామలోనే ఉంటా.. ప్రగతి భవన్ వెళ్తా..
- కేసీఆర్‌ను ఒప్పించి అభివృద్ధికి పైసలు తెస్తా
- బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- జనగామ పట్టణంలో విస్తృత ప్రచారం

జనగామ, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : వ్యక్తిగత స్వార్థం కోసం నాలుగు పార్టీలు మార్చిన ఊసరవెల్లి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చెప్పే కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మొద్దని బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. తెలంగాణ పోరాటం చేసినప్పుడు అతడికి ఓట్లేస్తే వైఎస్సార్సీపీకి అమ్ముడుపోయి.. డీల్ కుదరక బీఆర్‌ఎస్ వచ్చారని, ఇక్కడి నుంచి బీజేపీకి అక్కడ నుంచి కాంగ్రెస్ వెళ్లారని, ఎన్నికలప్పుడు ఒక్కో పార్టీ మారుతాడని ఎద్దేవా చేశారు. గురువారం జనగామ పట్టణంలోని 1, 6, 10, 18 వార్డుల్లో కౌన్సిలర్లు నీల శ్రీజ రాంమనోహర్, గాడిపెలి ప్రేమలతారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఆయన ప్రచారానికి జనం నుంచి అపూర్వ స్పందన వస్తుంది. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ.. ప్రభుత్వం చేపట్టిన ప్రగతి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. జై కేసీఆర్, జై పల్లా..జై జై బీఆర్‌ఎస్ నినాదాలతో హోరెత్తించారు. కొత్తగా అమలు చేయబోయే మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని, కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదిస్తూ స్పందిస్తున్న తీరు చూస్తుంటే బీఆర్‌ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరని స్పష్టం అవుతుందన్నారు. కాంగ్రెస్ చిన్న మైదానంలో పెట్టిన మీటింగ్‌కు సగం మంది కూడా రాలేదని, వచ్చినవాళ్లంతా రేవంత్ మాట్లాడుతుంటే మధ్యలోనే వెళ్లి పోతున్నారనే అక్కసుతో కేసీఆర్‌పై, నాపైన తిట్ల పూరాణం అందుకున్నారని మండిపడ్డారు. ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన తర్వాత జనగామ, చేర్యాలలో ఉంటానని, అవసరమైనప్పుడు ప్రగతి భవన్ వెళ్లి కేసీఆర్‌ను ఒప్పించి పైసలు తెచ్చి అభివృద్ధి పనులు చేయిస్తానని తెలిపారు. నేను పక్కా లోకల్ వాడినని, కాదనే హక్కు ఎవరికీ లేదన్నారు. కల్వకుర్తికి చెందిన రేవంత్‌రెడ్డి కొడంగల్, కామారెడ్డిలో పోటీ చేయచ్చు.. రాజగోపాల్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన భార్య వేర్వేరు ప్రాంతాల్లో పోటీ చేయచ్చు కానీ, ఈ ప్రాంతానికి చెందిన నాపై అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. గురువింద గింజ తన నలుపెరగదనట్లు మాట్లాడడం సరికాదన్నారు. ఈప్రాంతానికి ఏదో చేసినట్లు కొమ్మూరి మాట్లాడటం హాస్యాస్పదమని, కేసీఆర్ పోరాట ఫలితంగానే తపాస్‌పల్లి రిజర్వాయర్ వచ్చిందన్నారు. మా కుటుంబ సభ్యులంతా నాతోనే ఉన్నారని, నాతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతాప్‌రెడ్డి తండ్రి చనిపోకముందే నా కొడుకు దుర్మార్గుడు ఓటేయకండి అని చెప్పాడని, తల్లికి తిండి పెట్టలేనోడికి ఎట్ల ఓటేస్తారని కన్నతల్లే చెప్పిందని గుర్తుచేశారు. తల్లిదండ్రులను సరిగా చూడలేని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇక నియోజకవర్గ ప్రజలను ఏ విధంగా చూస్తారో గమనించాలన్నారు. కొమ్మూరి లాగా దందాలు చేసి భూములు కబ్జాలు చేసే చరిత్ర నాకు లేదని స్పష్టం చేశారు. అబద్ధపు ప్రచారం చేస్తే ప్రజలు తిప్పికొడుతారని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొందపెడతారని హెచ్చరించారు. జనగామ సభా వేదికపై రేవంత్ కూడా కొమ్మూరిని సతాయించకని విసుక్కున్న తీరు ప్రజలు చూశారని తెపారు. జనగామ సభతో వారికి ఓటమి తప్పదన్నారు. జనగామ ప్రజలు కేసీఆర్‌పై విశ్వాసం ప్రకటిస్తారని, కారు గుర్తుకు ఓటేసి నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తారనే నమ్మకం ఉందన్నారు. నేను ఇష్టపడి రాజకీయాల్లోకి వచ్చినవాణ్ని.. ఇక్కడ అభివృద్ధి కోసం రూ.70 కోట్లు కావాలంటే ఇప్పటికే సీఎం కేసీఆర్ రూ.72 కోట్లు ఇచ్చిండని తెలిపారు. కొమ్మూరికి నీతి, నిజాయితీ ఉంటే అభివృద్ధి పనుల్లో పోటీ పడాలని హితవు పలికారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో గురించి ప్రజలకు పల్లా వివరించారు.



ఎంపీపీ కృష్ణారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన వడ్డెర సంఘం నాయకులు

## కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 16 : మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామానికి చెందిన వడ్డెర సంఘానికి చెందిన పలువురు నాయకులు గురువారం మద్దూరు ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు నాయకులకు కృష్ణారెడ్డి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రేపు చేర్యాలలో జరిగే సీఎం కేసీఆర్ సభకు బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, నర్సయ్య, ప్రభాకర్, రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆదరించాలి



చేర్యాల మున్సిపాలిటీలో ప్రచారం చేస్తున్న శ్రీధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చేర్యాల, నవంబర్ 16 : చేర్యాల మున్సిపాలిటీతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ రూపొందించిన మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. అభివృద్ధి, సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆదరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణీశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ కమిటీ సభ్యుడు మేడిశెట్టి శ్రీధర్ తదితరులు ప్రజలను కోరారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు బూరగోని శ్రీనివాస్, కాసుల శ్రీనివాస్, ఆడెపు విజయ్, బూరగోని తిరుపతిగౌడ్, పచ్చిమడ్ల సాయికిరణ్, ఉమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ సభాస్థలి పరిశీలన

చేర్యాల, నవంబర్ 16 : ఈనెల 18న చేర్యాల పట్టణంలో నిర్వహించే భారీ బహిరంగ సభ ఏర్పాట్లను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పల్లా కరుణాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సభాస్థలి వద్ద స్టేజీ, తాగునీటి వసతి, పార్కింగ్, విద్యుత్ తదితర వాటిని బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట బీఆర్‌ఎస్ యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, నాయకులు గిరిధర్, చుక్కారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పచ్చిమడ్ల సాయికిరణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



చేర్యాలలో సీఎం కేసీఆర్ సభాస్థలిని పరిశీలిస్తున్న కరుణాకర్‌రెడ్డి తదితరులు



తపాస్‌పల్లిలో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

## బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

కొమురవెల్లి, నవంబర్ 16 : తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గురువారం బీఆర్‌ఎస్ నాయకులు కొమురవెల్లి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తపాస్‌పల్లిలో బీఆర్‌ఎస్ మాజీ మండల యూత్ అధ్యక్షుడు పుట్ట కనకరాజు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత అభివృద్ధి పరుగులు పెడుతుందని, మరోసారి అభివృద్ధికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 16 : ధూళిమిట్ట మండలం లింగాపూర్‌లో నేటి నుంచి ఈ నెల 19 వరకు శ్రీ రాజరాజేశ్వస్వామి, ఆంజనేయస్వామి ఆలయ 22వ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్షికోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

## 'పల్లా'ను భారీ మెజార్టీతో గెలిపించాలి



మద్దూరు : రేబర్తిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 16 : బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ ప్రజలను కోరారు. గురువారం మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశంతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ ఫలితాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సవితాచంద్రశేఖర్, మాజీ ఎంపీపీ యాదయ్య, మాజీ సర్పంచ్ భూపతి, నాయకులు నల్ల బాల్‌రెడ్డి, జంగిటి కమలాకర్, డాకూరి మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, బొద్దుల చంద్రశేఖర్, గవ్వల గణేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 16 : రేపు చేర్యాల పట్టణంలో జరిగే సీఎం కేసీఆర్ సభను బీఆర్‌ఎస్ శ్రేణులు విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మద్దూరు మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చేర్యాలకు వస్తున్న సీఎం కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలకాలన్నారు. చేర్యాల ప్రాంత అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ సభ చేర్యాల చరిత్రలో స్థిరస్థాయిగా నిలువనుందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, బీఆర్‌ఎస్ మైనార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరీఫ్, సీనియర్ నాయకుడు పుట్ట వెంకట్రమణారెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జిలానీ, సర్పంచ్ బొల్లు కృష్ణవేణీచంద్రమౌళి, కురుమ సంఘం మండల అధ్యక్షుడు బర్మ రాజమల్లయ్య, ఉపసర్పంచులు బెడద కుమారస్వామి, మేక మాధవీగోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ మేక మల్లేశం, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు మంద సుమన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

**బహిరంగ సభకు భారీగా తరలిరావాలి..**

చేర్యాల, నవంబర్ 16 : ఈనెల 18న చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు మహిళలు భారీగా తరలిరావాలని మాజీ జడ్పీటీసీ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు ఉల్లెంగల పద్మాఏకానందం కోరారు. మండలంలోని ఆకునూరు గ్రామంలో ఆమె ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు బొట్టు పెట్టి సీఎం కేసీఆర్ బహిరంగ సభకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో మహిళలకు ఆత్మగౌరవం పెరిగిందని, కాంగ్రెస్‌తో మహిళలకు జరిగింది శూన్యమన్నారు. కార్యక్రమంలో మహిళా మండల నాయకురాలు జయ, మహిళలు పాల్గొన్నారు.



చేర్యాల : ఆకునూరులో సీఎం కేసీఆర్ సభకు రావాలని మహిళలకు బొట్టు పెడుతున్న ఉల్లెంగల పద్మాఏకానందం